# వంశాంకురం



సుబ్బులు. వెంకడు వెన్నెట్లో చల్లగాలికి కృష్ణ వొడ్డున కూర్చున్నారు. ఈ నాటి మాటా ! పదేళ్ళ క్రితం పెళ్ళయినప్పటి నుంచి ప్రవాహంలో అలల్లా, ముత్తయిదు నుదుటి మీద కుంకం బొట్టులా ఒకర్నొకరు విడవకుండా. వానలో. ఎండలో. బీళ్లలో. చాళ్లలో లంకల్లో. పుంతల్లో కలిసి మెలిసి తిరిగారు. అవేమి కతలో ! అవేమి వూసుల్లో! ఆ కలిసి అంబలి జుర్రుకోటం. ఆ కలిసి నక్షత్రాలు లెక్కపెట్టటం వాళ్ళకే చెల్లింది. గాలిలా స్వేచ్ఛగా. గడ్డిపువ్వుల్లా అమాయకంగా

ఉన్నదే చాలనుకుని తృప్తితో కాలం గడుపుతున్నారు.

సుబ్బులు పెద్దయ్యగారింట్లో పనిచేస్తుంది. వెంకడు పెద్దయ్యగారి పొలం పనులు చూస్తాడు. పెద్దయ్యగారు భవంతి వెనకాల పాకేసి ఇచ్చాడు వీళ్ళిద్దరికీ. ఆ పూరి పాకనే ఇంద్రభవనం చేసుకుని ప్రతి క్షణం కలిసి అనుభవిస్తుంటే తెలియకుండానే పదేళ్ళు వెళ్ళిపోయాయి.

ఇవ్వాళ సుబ్బులెందుకో దిగులుగా ఉంది. సుబ్బులు అలా ఉంటే వెంకడికి కళ్ళనీళ్ళు తిరిగిపోతాయి. గిలగిల్లాడిపోయి అడిగాడు. 'ఏందే అట్టుండవు?' సుబ్బులు కన్నీళ్ళు తుడుచుకుంటూ అంది. "'ఏం లేదు మావా ! మనం మనువాడి పదేళ్ళయిపోయింది.మనింట సంటోడుకెవ్వుమనలేదే, ఓ బుడ్డోడు నేల పాకులాడలేదే అని."

వెంకడు కాస్సేపు మాట్లాడలేదు. ఆ తర్వాత తేరుకుని నవ్వుతూ అన్నాడు "పోన్లేయే ! మనకు తింటానికే సాలటం లేదే! మరింకో డెందుకులేయే?"

"ఆడదాని మనసు నీకు తెలవదు మావా? సంటోడు లేని ఇల్లు ఇల్లు కాదయ్యా! పెపంచకం మనతోనే ఆగిపోదు గదా! మనవొంశం నిలవాలంటే, మనకిన్ని నీళ్లు వొదలాలంటే బుడ్డోడు కావాలయ్యా."

"అయితే వోర్నయినా పెంచుకుందా మంటావే?" అన్నాడు సూటిగా చూస్తూ వెంకడు.

"'పెంపుడు బిడ్డ మన బిడ్డవుతాడా?" అంది సుబ్బులు.

"అయితే ఏం చెయ్యమంటావ్?" అన్నాడు వెంకడు.

"నేను గొడ్రాలినని నాకు సింతలేదు. నువ్వు మగాడివి ..... పదిమంది బిడ్డల్ని కంటావు. నామాటిని, నువ్వు మారు మనువు సేసుకుని నాకు కొడుకును కనయ్యా" అంది సుబ్బులు.

వెంకడు అదిరిపడ్డాడు. దుంఖం పొంగుకొచ్చింది. "అంత నీచప్పని నేం చేస్తానంటే? నిన్నొదొలుకుని ఇంకొకత్తెని కట్టుకుని నీకు ద్రోహం చేస్తానంటే"

అంటూ ఆవేశపడ్డాడు.

సుబ్బులు వెంకణ్ణి నెమ్మదిపరుస్తూ గుండె నిమురుతూ "సల్లబడయ్యా! నిమ్మళంగాలోచించు. నువ్వెల్లప్పుడూ నా వోడివే! నాకు ద్రోహం తలపెట్టవు. మేమిద్దరం అప్పసెల్లెళ్ళలా ఉంటాం. వొంశం కోసం మనువాడు మావా!"

'తప్పదేంటే?' అన్నాడు వెంకడు.

'నాకోసం మావా!' అంది సుబ్బులు.

కన్నీళ్ళతో సరేనని తలూపి గట్టుమీంచి లేచాడు వెంకడు.

మర్నాడే సుబ్బులు అంగాపురం వెళ్ళి పింతల్లి కూతురు లచ్చి సంబంధం ఖాయం చేసుకొచ్చింది. దగ్గరుండి పెళ్ళి జరిపించింది. పాకలో తడిక అడ్డం గట్టించి శోభనం నిశ్చయించింది. వెంకడు పెళ్ళయితే చేసుకున్నాడు. కాని, రెండో పెళ్ళాన్ని పెళ్ళాంలా చూడలేకపోతున్నాడు. ఏ అసూయా లేకుండా సుబ్బులు లచ్చికి జడవేసి అన్ని అలంకారాలు చేస్తుంటే వెంకడికి గుండె పీకినట్లయ్యేది. పూలుతెచ్చినా, మిఠాయి తెచ్చినా సుబ్బులుకి ఇచ్చేవాడు కాని లచ్చికి ఇచ్చేవాడు కాదు.

శోభనం నాటి రాత్రి తడిక అవతల చడీ చప్పుడు లేకపోతే గొప్ప నిరాశ పడింది సుబ్బులు. పదిరోజులు గడిచాయి. వెంకడు లచ్చితో మాట మాత్రం మాట్లాడలేదు.

ఒకరోజు సుబ్బులు లచ్చికి పూలు తురుముతుంటే లచ్చి అంది "ఎందుకక్కా నాకు పూలు? మావ నాతో పలకడు. ఉలకడు" అని. అప్పుడు సుబ్బులు చెప్పింది. "పిచ్చిదానా! మొగాడి మనసెరిగి మసులుకోవాలే! ఆడి కేదిష్టమో తెలుసుకుని ముందుగా చేస్తే సంబరపడ్తాడు"

"అయితే మావకిష్టమయినట్టుంటాను. ఏం చెయ్యాలో చెప్పు!"అంది లచ్చి ఆశగా.

సుబ్బులికి జాలేసింది. మావకి అంబలి ఇస్తావు గదా! నువ్వు ముందు ఎంగిలి చెయ్యి? "అయ్యో! ఎంగిలయిందే" అను. ఎందుకు చేశావంటాడు. "ఉప్పు

కారం సాలిందో లేదో ..... నా మావకి రుసులు సమంగాలేని అంబలిస్తానా?" అను. రాత్రి పడుకునేప్పుడు పక్కమీద తెల్లదుప్పటే పరు. మావ తలక్రింద మెత్తటి దిండు పెట్టు. పడుకోబోయేప్పుడు నీ తల్లోని పూలసెండు మావ తలదిక్కుగా పెట్టు" అంటూ చాలా చెప్పింది.

లచ్చి కళ్ళు మిల మిల మెరిశాయి. సరిగ్గా సుబ్బులు చెప్పినట్లే చేసింది లచ్చి. వెంకడు అబ్బురపోయాడు. కళ్ళెత్తి చూశాడు. దోసపండులాంటి లచ్చి. "నీ అక్క కూడా సరిగ్గా నీలాగేనే!" అన్నాడు లచ్చి కళ్ళలోకి చూస్తూ. లచ్చి పొంగిపోయి అంబలి తనకి ఉంచుకోకుండా మొత్తమంతా మావచేత తాగించింది.

తడిక పక్క నవ్వులు గుసగుసలు విన్పిస్తుంటే సుబ్బులు మనస్సు తేరుకుంది. మూడునెలలకే లచ్చి నీళ్ళోసుకుంది.

అక్కడి నుంచి వెంకడు, సుబ్బులు పోటీపడి లచ్చికి కావాలసినవన్నీ ఏర్పాటు చేసేవారు. లచ్చిని బరువు పనులేవీ చెయ్యనివ్వటంలేదు సుబ్బులు. వెంకడు లచ్చి నలిగిపోతోందేమో అన్నట్టు చూస్తున్నాడు. తొమ్మిది నెలలు నిండిన ఓ రోజున ఆపాకలో ఓ చంటాడు"కెవ్వు"మని ఏడిస్తే సుబ్బులుకి గుండె జలదరించి జలజల కన్నీళ్ళు కారాయి. ఆ క్షణం కోసం ఎన్ని సంవత్సరాలు కాచుకుంది?

ఎన్ని దేవుళ్ళకు మొక్కుకుంది!

చంటాణ్ణి గుండెలకి హత్తుకుని ధారలు ధారలుగా ఏడ్చింది.

నెలలు గడుస్తున్నాయి. చంటాడు తల్లిదగ్గర పాలు తాగటం తప్ప పెంపకమంతా సుబ్బులే. వాడితో నవ్వుతుంది. కథలు చెప్తుంది. పాటలు పాడుతుంది. ఏడుస్తుంది. చిచ్చికొడ్తూ తన పక్కలోనే పడుకోబెట్టుకుంటుంది.

కాని వెంకడు లచ్చి కితకితల్లో మునిగిపోయాడు. సుబ్బులుతో రోజుకి ఓసారి మాట్లాడతాడో లేదో! సుబ్బులు చంటాడ్ని వొళ్ళో పడుకోబెట్టుకొని ఎప్పుడన్నా అనుకునేది 'నాకు నాదేవుడు దూరమైపోయాడా? లేదు ... లేదు.... నా దేవుడిడుగో! నాదగ్గరే వున్నాడు" అంటూ చంటాణ్ణి వొళ్ళంతా ముద్దులు పెట్టుకుంటుంది.*